కథ

# చీకటి మచ్చ

## డా. బి.ఎస్.ఎన్. మూర్తి

చంద్రంపేట ఊళ్ళో వీరినాయుడికి నాలుగేళ్ళు నిండాయి. వాడికో చెల్లెలు రెండేళ్లది ఉంది. 'దాంతో ఇంటికాడ ఆడుకోరా' అని అమ్మ చప్పినా వినడు. అయ్య పొలానికి ఎళ్తే ఈడూ వెనకాలబబోతాడు. ''ఈడికి అన్నీ తొందరే. పుట్టడమూ నెలలు నిండకుండా పుట్టేసాడు. నాలుగేళ్ళయ్యేసరికి కూలీపనికి ఎగబడిపోతున్నాడు. మరో రెండేళ్ళు ఆగరా కొడాలి పట్టుసేతికి దొరకతాది అంటే ఆగడు'' అంటూ ఇసుక్కునే వాడు వాడయ్య.


మరో రెండేళ్ళు గడిచాయి. ఆడేదో సరదాగా కూలికీ నాలికీ ఎల్లి వంటికి మట్టి అంటించుకొని ఆడుకుందామనుకుంటూండగా ఆడి జీవితాన్నే మార్చేసే ఒక సంఘటన జరిగిపోయింది.

ఆ రోజు ఆ ఊరి రచ్చబండ మీద పెద్ద మాష్టారొకడు మీటింగు పెట్టాడు. చిన్నా, పెద్దా ఆడా మగా జనాలందరూ చేరారు. ''పిల్లలందరూ చదువుకోవాలి లేకపోతే వాళ్ళు పాడయిపోతారు. దేశమూ పాడయిపోతుంది. అసలు పిల్లల్ని చదివించకపోడం పెద్దనేరం కూడా'' అన్నాడు. ఆ మాష్టారు వీరినాయుడి ఆయ్యతో మాటాడాడు. వీరినాయుడిని బళ్ళో చేర్పించడానికి ఒప్పించేసాడు. అలా బళ్ళో చేరాడు వాడు. అయిదేళ్లు గడిచేసరికి అయిదోక్లాసుకు వచ్చేసాడు.



అయిదో క్లాసులో ఓ సాయంత్రంవేళ వీధి గడపలో వాడు కూచుని ఇంగ్లీషు అంకెలు పైకి చదవడం మొదలెట్టాడు. ఒన్...టు...త్రీ... అంటూ ఇంగ్లీషు అంకెల్ని చూడకుండా అప్పజెప్పినట్టు చదివేసాడు. అదే ఆ వీధిలో అటేవెళ్తూన్న సర్పంచి విన్నాడు. ఆడ్ని పొగిడేసాడు ''ఒరేయ్ ఒరేయ్ ఎంత ఇంగిలీసు వచ్చేసినాదిరా నీకు. నువ్వు దొరసానికి పుట్టేవేట్రా? నీ బాబు పేరేటి? డేవిడ్ సన్నా, లావింగ్ స్టోనా?'' అన్నాడు. ఆ మాటలు ఆడి బాబు విన్నాడు. ''ఈడికింత తెలివితేటలు ఎలాగొచ్చేస్సాయో'' అని సరదా పడిపోయేడు.

అయిదో తరగతి పాసయాక మరో మాష్టారు అన్నాడు ''ఇంకా చదువు. ఆ బండి అలా వెళ్ళినా. చది



వినవాళ్ళు డాక్టర్లు, ఇంజనీర్లు, ఆఫీసర్లు ఆవుతున్నారు. దేశానికి వాళ్ళే కావలసింది. సరేనన్నాడు. హైస్కూలులో చేరాడు. పదో తరగతి దాకా లాగించేడు. అప్పుడాలోచించాడు. 'నేను చదివితే దేశం బాగుపడతాదన్నారు. బాగుపడ్డదా లేదా? తనకు తెలీదు పోనీ నేను బాగుపడ్డానా' అని ఆలోచించాడు. అసలు బాగుపడ్డం అంటే ఏటి? ఏ కూలోనాలో చేసుకుంటూ ఏల కింత తిండి తినేసి ఏలకింత నిద్దరోతూ ఉంటే హాయిగా బతకడం కాదా. అది బాగుపడ్డం కాదా. ఇప్పుడో పొలాల్లో పనికి ఎల్లడం చిన్నప్పుడే తప్పిపోయింది. ఇప్పుడా పనికి ఎల్దామన్నా చెయ్యాడదు. తోటోళ్ళు చదూకున్నోడివి "నీ కెందుకురా ఈ బురదపనులు?" అంటారు. ఇంకా "చదువుకోరా పట్టణంలో కాలేజి ఉంది. రోజూ సైకిలు మీద పనులు?" అన్నాడు మరో మాష్టారు. కాని ఆడికి చదవడానికి మనసొప్పుటేదు. ఎక్కడో పని జూసుకోవాల.

అతగాడికి అనుమానమొచ్చింది. అందరూ చదివేసుకొని ఉజ్జోగాలకోసం ఎగబడితే నాగలిపట్టడం, పొలం దున్నడం ఎవరు చేస్తారు? అడవికెళ్ళి ఎదురుకర్రలతో తోటలకెళ్ళి సరుగుడు కర్రలూ ఎవరు తీస్తారు? అలాటోళ్ళు లేకపోతే లోకం నడుస్తాదా? ఇంట్లో వట్టినే కూచోడం ఇట్టంలేక టౌన్లో ఒక హోటల్లో సర్వరుగా చేరాడు. మరికొన్నాళ్ళు పెట్రోలు బంకులో పనిచేసాడు.

తెలిసినోళ్ళెవరో పక్కనే సాలూరు టౌనులో ఉన్న ఇంజనీరింగు ఆఫీసులో బంట్రోతు పోస్టు ఉందని చెప్పారు. అప్లై చెయ్యమన్నారు. చేసాడు. ఆడుజ్జోగం వచ్చింది. రాగానే 'గవర్నమెంటు ఉజ్జోగం నీకేట్రాలోటు' అని ఊళ్ళో వాళ్ళన్నారు.

పక్కవీధిలో ఉన్న ఎంకటలచ్మి ఈ మజ్జిన అందంగా కనిపిస్తుంది. అదంటే తనకు ఎంతో ఇట్టం. దాంతో ఈ ఉద్యోగం విషయం చెప్పాడు. దానికేటి అర్థంకాలేనట్టుంది. 'అదేటిగొప్ప' అంటూ మూతి విరిచింది. అప్పుడు ఇంకా అందంగా కనిపించింది.

ఉద్యోగంలో చేరాడు. తనూరికి ఆరుకిలోమీటర్ల దూరంలోనే ఆఫీసు. అందుచేత తనూరినుండే రోజూ తిరగాలని నిశ్చయించుకొన్నాడు. కొద్ది రోజుల్లోనే ఆఫీసు విషయాలు అర్థమయాయి. ఆఫీసులో ఇంజనీర్లు, గుమాస్తాలు అందరూ తనకన్నా ఎక్కువ చదివిన వాళ్ళే. వాళ్ళవల్లే దేశం బాగుపడుతుంది అనుకునేవాడు. వాళ్ళ దగ్గరికి కాంట్రాక్టర్లు రావడమూ టెండర్లు నిర్ణయించుకోడమూ పర్సెంటేజీలు అనుకోడమూ చూసేవాడు. ఆఫీసులో అందరికీ ఎవరి పెర్సంటేజి వాళ్ళకు ముట్టడమూ చూసేవాడు. మరి వాళ్లందరూ చాలా బాగుంటే కదా వాళ్లు దేశాన్ని బాగు చెయ్యగలరు. ఇలాగే మూడేళ్ళు గడిచాయి.

ఈలోగా చెల్లెలికో పెళ్లిసంబంధం చూసి అయ్యి పెళ్లిచేసాడు. ఇన్నాళ్ళు తన జీతం కూడా కలిసిరావడం వల్ల అయ్య భద్రంగా నెట్టుకొచ్చేశాడు.

చెల్లి పెళ్ళయాక కొన్నాళ్ళకు ఈడూ పెద్దోడయిపోతున్నాడని అయ్యాపోరేవాడు.

''ఒరేయ్ ఈడీ...పెళ్లి సేసుకొంటావురా?'' అడిగాడు.

''సేసుకుంటాను'' అన్నాడు.

''ఎవత్తిని సేసుకొంటావురా?''

''దాన్నే సేసుకొంటాను'' అన్నాడు వాడు.

ఎంకటలచ్మి ఉద్దేశం వేరు. ''ఈడు పట్నాల బతకోల్సినోడు. పట్టనాలంటే నాకు సిరాకు. ఉదయం పూట సదన్నం తిని పాటలు పాడుకొంటూ నలుగురితోకలిసి పొలం పనులు సేసుకొంటూ బతక్క యీ ఉజ్జోగానితో సంసారమేటి? నానీ సంబంధం సేసుకోను'' అంది.

తనకు చదువు అబ్బడం వల్లా, లేక కొంచెం ఎక్కువ చదివేసాడనా ఎంకటలచ్మి తనను చేసుకోలేదు. వాడికి తెలియలేదు.

తండ్రి ఇంకో సంబంధం చూసాడు. పెళ్ళయింది. ఈలోగా ఈరినాయుడికి పార్వతీపురం ట్రాన్సఫరు అయింది. ఉంటున్నూరికి దూరం. అక్కడ ఇంటద్దెలు ఎక్కువ. చిన్నపాటిల్లు అద్దెకు సంపాదించి ఫేమిలీ పెట్టాడు.

అదృష్టం కొద్ది పెళ్లానికి వెంటనే నెలతప్పింది. దురదృష్టం కొద్దీ దానికి ఏదో జబ్బొచ్చి పడింది. జొరం వాంతులు నీరసించిపోసాగింది. జీతం చాలావరకు దానిమందులకే అయిపోతుండేది. పురిటి సమయం ఆపరేషను అన్నారు. రక్తం చాలదన్నారు. తెలిసిన వాళ్ళదగ్గర అప్పులు చేసి ఖర్చులు పెట్టాడు. కొడుకుపుట్టాడు. పెళ్ళాంతో బాటు కొడుక్కి మందులు. జీతం చాలదు. అయ్యకు కబురు పెట్టాడు. నెలకో వెయ్యిరూపాయలు సాయం చెయ్యమని. అయ్య ఆశ్చర్యపోయాడు. ''నువ్వు డబ్బంతా బాంకులో దాచేస్తున్నవనుకున్నాను. ఇక్కడ మీ అమ్మకూడా మంచమెక్కింది. నానేటి పంపించగలనూ?'' అన్నాడు.

వీరినాయుడు చెప్పాడు. ''ఈ పట్టణాలంబడి

పెళ్ళాన్ని, పిల్లల్ని నేను పోషించలేను. నీ దగ్గరే ఆళ్ళ నుండనీ'' అంటూ పెళ్ళాన్ని, బిడ్డనీ చంద్రంపేట దిగబెట్టేసాడు.

వాడు పనిచేసే ఆఫీసులో సెక్షను ఆఫీసరు పోస్టులో ఇంజనీరు రావుగారున్నారు. అందరూ ఆయన్ని 'ఇంజనీర్రావు' అంటారు. తెల్ల ఫాంటూ, తెల్లచొక్కా ధరిస్తాడు. నుదుటి బొట్టుపెట్టి పవిత్రంగా కనిపిస్తాడు. నెమ్మదస్తుడు. వీరినాయుడు తొలిసారి ఆయనింటికి వెళ్ళినప్పుడు ఆ యిల్లు చూసి చాలా ఆశ్చర్యపోయాడు. ఇంటి వరండాలో అల్లిక వైర్లతో పాత కుర్చీల సెట్టు ఉంది. వైర్లు చాలా వరకు తెగిపోయాయి. ఓ మూల పాతకర్ర టేబులు, దానిముందర తుప్పట్టిన ఇనపకుర్చీలు, వరండా వెనకాల గది. అందులో పాత డబల్‌కాట్ మంచం సగం మాసిన దుప్పట్లతో ఉంది. ఓ మూల పాత బట్టల స్టాండు దానిమీద మాసిన బట్టలు. మరో మూల రంగు వెలిసిపోయిన ఇనప్బీరువా. ఆయన గారి ఇల్లాలు చవకబారు చీరకట్టుకొని ఉంది. చేతులకు మామూలు గాజులు, మెడలో పుస్తెలతాడు తప్ప మరేమీ లేదు. ఆయనకు ఇద్దరు పిల్లలు. మగా, ఆడ. స్కూలుకు వెళ్ళి వస్తున్నారు.

తర్వాత చాలాసార్లు ఏదో పనిమీద ఆ ఇంటికి వెళ్ళిరావడం జరిగేది.

ఒకసారి ఆ ఇంటికి వెళ్ళినప్పుడు కుర్రాడు తండ్రితో అంటున్నాడు. ''డాడీ ఈ రోజు ఫీజు కట్టడానికి ఆఖరు రోజు. ఎలాగైనా కట్టాలన్నారు టీచరు'' దానికి రావుగారు, ''నా దగ్గర ఫీజుకట్టడానికి ఈ రోజు డబ్బులేదు. రేపో ఎల్లుండో జీతాలందుతాయిగా ఫైనుతో కట్టేద్దాములే'' అన్నారు.

ఆ రావుగారికి చాలామంది ఉద్యోగస్తులకన్నా మంచి జీతమే వస్తుండాలి. అతడికేవో అప్పులో ఖర్చులో ఉన్నాయనుకున్నాడు. కొడుకు ఫీజుకు కూడా సొమ్ము లేకపోయిన ఆయన్ని చూస్తే వీర్నాయుడికి జాలేసింది. ఆయనమీద భక్తీ గౌరవం పెరిగిపోయాయి. దేశానికి కావలసింది ఇలాటి వాళ్ళే కాబోలు అనుకొన్నాడు.

అటువంటి ఇంజనీర్రావుగారు ఒకసారి ప్రత్యేకంగా మాటాడాలని వాడికి కబురుపెట్టారు. హోటలు గదిలో ఎదురుగా కూర్చోబెట్టి ''చూడు వీర్నాయుడూ. నా చేతిలో పవరుంది. చాలా కాంట్రాక్టులున్నాయి. నీ తీరు, నీ వినయం నాకు నచ్చాయి. ఆ కాంట్రాక్టరు పనుల్లో కొన్ని నా పేరు మీద చేద్దాం. నువ్వు ఉద్యోగానికి రాజీనామా ఇవ్వు'' అన్నారు. వీర్నాయుడు బెదిరిపోయాడు. ఉన్న ఉద్యోగం పోతే బతకడం ఎలాగ'' అన్నాడు. రావుగారు చెప్పారు. ''నువ్వేం కంగారు పడిపోకు. నీకు మంచి కాంట్రాక్టులు కొన్ని ఇప్పిస్తాను. పెట్టుబడి నేనే పెడతాను. పని నేనే చేయిస్తాను. బిల్లు అయాక సొమ్ము నీ పేరే వస్తుంది. అది నాకు చెందాలి కాబట్టి నాకు ఇచ్చేయ్. ఇందులో నీ జీతంకన్నా మూడింతలు ఎక్కువే నెలనెలా నీ కిస్తాను. సరేనా?''

అతడి మాటలు వీరినాయుడు మొదట నమ్మలేకపోయాడు. అందులో లాభనష్టాలు, మంచిచెడ్డలు బేరీజు వేసుకోసాగేడు. ఆ జీవితంలో ఇంకాస్త మెరుగైన బతుకుంటది. ''అలాగే'' అన్నాడు.

ఉద్యోగానికి రాజీనామా చేసేసాడు.

అప్పటి నుండి వీరినాయుడు చిన్న సైజు కాంట్రాక్టరు అయిపోయాడు. మొదట్లో చిన్న పనులు మాత్రమే శాంక్షను అయ్యేవి. అవి పూర్తి చేసి అందుకొన్న సొమ్ము ఇంజనీర్రావుగారికే ఇచ్చేసేవాడు. మాటిచ్చినట్టే మూడొంతుల జీతాన్ని రావుగారు ఇచ్చేవారు. అలా అలా వీరినాయుడు దగ్గరకు సొమ్మురాసాగింది. బతుకుతీరు మారింది.

తోచినపుడల్లా చంద్రంపేట వెళ్ళి పెళ్ళాంబిడ్డలతో ఒకరోజు గడిపి వచ్చేవాడు. వీడి రాబడితో తండ్రి కష్టాలు తీరసాగాయి.

ఇలా ఒక ఏడాది గడిచింది.

అతడికి ఒకటి అర్థమైంది. ఈ రావుగారు తన కన్నా ముందర ఇలానే సొమ్ము ఎవరి పేరునో సంపాదించి ఉంటారు. అర్థం కానిది ఒకటుంది. ఆ సొమ్మంతా ఎక్కడి దాస్తున్నట్టు?

ఒక రోజు విశాఖపట్నంలో డాబా గార్డెన్సులో ఒక ఇంటి ఎడ్రెసు ఇచ్చి అక్కడ వాడిని కలవమన్నారు రావుగారు. వీరినాయుడు అడ్రసు వెతుక్కొంటూ అక్కడికి బయలుదేరాడు.

డాబా గార్డెన్సులో ఉన్న ఆ యిల్లు చాలా ఖరీదైనదిగా ఉంది. వీరినాయుడు అక్కడ గోడ మీద కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపుతెరచి లోపలినుండి ముప్ఫై ఏళ్ళ స్త్రీ వచ్చింది. ''నువ్వేనా వీరినాయుడివి?'' అంది.

''అవును'' అన్నాడు.

''లోపలికి వచ్చి కూర్చో'' అంది.

లోపల సోఫాలో కూర్చున్నాడు.

''రావుగారు నీ గురించి చెబుతుంటారు. నువ్వేదో వయసులో బాగా పెద్దవాడివనుకున్నాను. ఫరవాలేదు. వయసులోనే ఉన్నావు'' అంది.

''రావుగారు లేరా?''

''లేరు కాసేపట్లో వస్తారు. నిన్ను కూర్చోమని చెప్పారు'' అందామె.

అప్పుడామెను పరీక్షించి చూసాడు. బంగారు చాయతో మెరిసిపోతూంది. ఖరీదైన చీరకట్టుకొంది. చేతులకు బంగారు గాజులు మూడు జతలున్నాయి. మెడలో ఖరీదైన గొలుసుల పేట ఉంది. చెవులకు దుద్దులు కాళ్ళకు పట్టీలు చాలా విలువైన స్త్రీలా ఉంది.

ఇంట్లో ఖరీదైన సోఫాసెట్టూ ధగధగమెరిసే గాడ్రేజీ బీరువాలూ, డ్రెస్సింగు టేబులూ, నున్నగా మెరిసే పాలరాతి గచ్చులతో ఇల్లు కూడా చాలా విలువైనదే.

''ఏమిటలా చూస్తున్నావు? ఈ ఇల్లు రావుగారిదే. కాని నా పేర్నే ఉంది. నా పేరు జోగులాంబ'' అందామె.

ఆమె వంక చూసాడు.

''నే నెవరా అని నీ అనుమానం కదూ. నేను రావుగారి సెకండ్ సెటప్‌ని. ఇదేకాక మరికొన్ని ఇళ్ళు, పొలాలు అన్నీ నా పేరునే ఉన్నాయి'' అంది.


వీరినాయుడుకు విషయం బోధపడటానికి కొంత సమయం పట్టింది.

''ఏసీబీ వాళ్ళు రైడింగులూ చేస్తున్నారు కదా. ఎవరికీ దొరక్కుండా చాలా మంది ఇలానే సెకెండు సెటప్పుల పేరు మీద ఆస్తులు దాచుకొంటారు. ఎప్పుడైనా సోదా జరిగితే ఫస్ట్ ఫేమిలీ ఇంట్లోనే జరుగుతుంది'' అసలు విషయం చెప్పింది.

''పెద్దోళ్లు ఇలా క్యాడా బతుకుతూ ఉంటారా!'' అని వాడు ఆశ్చర్యపోయాడు.'' ఉండు టీలు తెస్తాను'' అంటూ ఆమె లోపలికి వయ్యారంగా వెళ్ళింది.

తర్వాత రావుగారు వచ్చారు. ఇద్దరూ 'టీ' తాగుతూ కాంట్రాక్టు బిల్లుల గురించి కొన్ని విషయాలు మాట్లాడుకొన్నారు.

అప్పటి నుండి విశాఖలో ఆ ఇంట్లోనే ఇద్దరూ



తరచు కలుసుకొని విషయాలు చర్చించుకొనేవారు. వారిద్దరి మధ్య స్నేహబంధం బలపడింది. వీరినాయుడు పేర పెద్ద కాంట్రాక్టులు రాసాగాయి.

వీరినాయుడు మొదట్లో జోగులాంబతో మాటాడటానికి కొంత బిడియపడ్డా తర్వాత బిడియం వదిలేసింది. ఒకసారి అతడొక్కడే ఉన్నప్పుడు ఆమె అంది. ''నువ్వెప్పుడైనా ఈ ఇంటికి నీ సొంత ఇంటికి వచ్చినట్టు రావచ్చు. పోవచ్చు. లేదా కాసేపు ఇక్కడే గడపొచ్చు. నీకు దేనికీ అడ్డుండదు'' అంటూ జారిన పైట సద్దుకుంది. ఆ మాటలో ఏదో ద్వంద్వార్థం వినిపించింది వీరినాయుడికి. గజగజ వణికిపోయాడు.

అతడిలో కొత్త ఆలోచనలు చోటు చేసుకున్నాయి. రావుగారు కళ్ళముందు కదిలారు. మనుషులు డబ్బు సంపాదించేందుకు ఇంతేసి నాటకాలాడుతుంటారా? అంతా మోసం... దగా... తను రావుగారి ఛత్రంలో బందీ కాకూడదు. 'ఏదో చెయ్యాలి' ఆలోచించాడు.

కొన్నాళ్ళు గడిచాయి. వీరినాయుడు ఇప్పుడు పెద్ద కంట్రాక్టర్ల లిస్టులో కొచ్చేడు. పెద్ద బిల్లులు చేస్తున్నాడు.

ఒకసారి రోడ్డు కల్వర్టులు బాగు చేసే పనిని కాంట్రాక్టర్లందరూ రింగు ఏర్పడి దక్కించుకొన్నారు. అందులో ముప్ఫై లక్షల రూపాయలు రావుగారిది. నాలుగయిదు నెలలయాక పని పూర్తయింది. కాని ముప్ఫై లక్షల రూపాయల బిల్లు పెండింగులో ఉండిపోయింది. ఒకసారి రావుగారూ వీరినాయుడు హోటల్లో టీ త్రాగుతూ ఉండగా జోగులాంబ ప్రస్తావన వచ్చింది. వీరినాయుడు రావుగారితో అన్నాడు ''మీ రెండో ఫామిలీ చాలా బాగుంటారండీ''

''అలాగా'' అన్నారు ఇంజినీరు.

''ఆవిడదంతా విశాల హృదయం మీ మనషుల్ని చాలా అభిమానంగా చూసుకొంటుంది''

రావుగారికి అనుమానమొచ్చింది. ''వీడేటి... నా రెండో ఫేమిలీ గురించి తెగమాటాడేస్తున్నాడు. వీడుకాని దానికి లైనేస్తున్నాడా! లేదా అది గాని వీడికి లైనేస్తున్నదా'' అనుకొని వాడి మొహం వరకు చూసాడు. ఛఛ... అది మంచిదే. వీడి మొహమే దొంగోడిదిలా ఉంది. వీడిని అక్కడే ఆపేయాలి. ఈసారి పెద్దబిల్లు వీడిపేరు మీద వస్తుంది. చేతులు ఇరుక్కుపోయాయి. ఆ సొమ్ము చేతికందాక వీడ్ని వదిలించుకోవాలి'' అనుకొన్నాడు. అతడి ఆలోచనల్ని వీరినాయుడు పసిగడుతూనే ఉన్నాడు.

కొద్ది రోజులకు బిల్లు అయిపోయింది. ముప్ఫై లక్షల చెక్కు వీరినాయుడి చేతికి రావటమూ, అది మార్చడం జరిగింది. ఆ డబ్బుతో మూటా ముల్లే సర్దేశాడు. తన మకాం సొంతూరు చంద్రం పేటకు దగ్గరగా ఉన్న సాలూరు టౌనుకు మార్చేసాడు. అక్కడే ఒక ఇల్లు తీసుకొని పెళ్ళాం బిడ్డల్ని తీసుకొచ్చి కాపురం కూడా పెట్టేడు.

కాంట్రాక్టరుగా గుర్తింపు పొందాడు కాబట్టి రావుగారితో సంబంధం లేకుండా పెద్ద కాంట్రాక్టులే దక్కించుకొన్నాడు. బిల్లు అయ్యాక సొమ్ము తనవద్దకే చేరేది. అలా చాలా సొమ్ము చేరింది.

ఆ ఊళ్లో ఒక హైస్కూలు లాడ్జింగు హోటలు ఒకటి అమ్మకానికి వచ్చింది. వీరినాయుడు ఆ హోటలు కొనేశాడు. అందుకు బాంకు లోను కూడా ఇచ్చింది.

వాడి పరపతి పెరిగింది వాడి చుట్టూ చిన్న చిన్న రాజకీయనాయకులు చేరారు. ''నీ లాటోడు రాజకీయాల్లోకి రావాలి గురూ'' అంటూ వాడిని ప్రోత్సహించసాగేరు.

వీరినాయుడుకు ఆ టౌన్లో పుస్తకాల బేగు భుజాన వేసుకుని స్కూలుకు వెళ్తున్న పిల్లల్ని చూసినప్పుడల్లా వాళ్ళ భవిష్యత్తు గురించి ఆలోచించడం అలవాటయిపోయింది. వాళ్ళో ఎందరు ' ఇంజనీరావులు' తయారవుతారా అనుకొనేవాడు.

ఓ సాయంత్రం చంద్రంపేటలో తన ఇంటికి వెళ్ళి వస్తూండగా రచ్చబండమీద మాష్టారొకాయన మీటింగు పెట్టి జనాలకు చెబుతున్నాడు. ''పిల్లలందరనీ బడిలో చేరాలి. ఒడిలో చేరి చదివిన వాడు ఒక్కొక్కడూ ఒక్కొక్క వెలుగు కిరణం. ఇలాటి కిరణాలు దేశమంతా ఉంటే దేశమంతా వెలుతురే'' వీరినాయుడు అక్కడ ఆగాడు.

అప్పుడే మాష్టారు వీరినాయుడ్ని చూసి పిల్లలందరికీ అతడ్ని పరిచయం చేసారు. ''ఈయన చదువుకొని ఎలా పైకి వచ్చాడో చూసారా! మీరూ చదువుకొంటే వీరినాయుడి గారిలా గొప్పోళ్ళవుతారు'' అన్నాడు.

వీరినాయుడు అక్కడ నుండి కదుల్తూ ఆ మాష్టారుని పక్కకు పిలిచాడు. అతడితో అన్నాడు ''చూడండి మాష్టారూ నేను చదవడం వల్ల పెద్దోడ్ని కాలేదు. నీతి నియమాల్ని పక్కకు పెట్టి మోసాలు చెయ్యడం వల్ల గొప్పవాడినాయ్యను. నాకు విజ్ఞానంతో బాటు మోసాలు చెయ్యడం నేర్పాయి చదువుల బళ్ళు. ఈ చదువులేమిటి చెబుతున్నాయ్? డబ్బెలా సంపాదించాలో చెబుతున్నాయి. సంపాదిస్తున్న వాడికి ఇంకా ఎక్కువ సంపాదించడం నేర్పుతున్నాయి. సంపాదాంచడానికి అడ్డమైన మోసాలూ చెయ్యడం చెబుతున్నాయి. చదివేవాడికే ఇవన్నీ. చదవనోడికి ఏమీ అక్కరలేదు. వాడికా రోజు గడిచిపోడానికి ఉంటే చాలు. ఈ చదివినోళ్ళతో దేశమంతా వెలుతురు ఎలా నిండిపోతుందో నాకు బోధపడలేదు. చదువుల పేరిట పిల్లల మనసుల్ని పాడు చేస్తూ పెద్ద వాళ్ళని చేసి దేశంమీదికి వదులుతున్నాం మనం. వాళ్ళందరూ వెలుతురు కాదు. చదివి పైకొచ్చిన ప్రతివాడూ వెలుతురుకి ఒక చీకటిమచ్చ. ఈ చదువుల్లో మార్పు రావాలి. మంచోళ్ళను మంచిగానే ఉంచే చదువేదైనా ఉంటే చూడండి''

వీరినాయుడు చెప్పిన విషయాలు విని మాష్టారుగారు ఇంకేమీ మాట్లాడలేకపోయారు.

★

